30 వరకు ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలకు గడువు

చేవెళ్ల, సెప్టెంబరు 23 : అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందేందుకు గడువును ఈ నెలాఖరు వరకు ప్రభుత్వం పొడిగించిందని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత తెలిపారు. అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సంవత్సరం డిగ్రీ ప్రవేశాల కోసం ఇంటర్ పాసైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9908640914 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ధర్మసాగర్‌ను జీపీగా ఏర్పాటు చేయాలి



వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల, సెప్టెంబరు 23 : మండల పరిధిలోని గొల్లపల్లి అనుబంధ గ్రామం ధర్మసాగర్‌ను పూర్తిస్థాయి గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు సోమవారం నగరంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీకి ఉండాల్సిన అన్ని అర్హతలు గ్రామానికి ఉన్నాయని తెలుపగా.. జీపీగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, బోజిరెడ్డి ఉన్నారు.



ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం



ఇబ్రహీంపట్నం పెద్ద చెరువును పరిశీలిస్తున్న హైడ్రా బృందం

ఆక్రమణలపై ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- ఇబ్రహీంపట్నం పెద్ద చెరువును సందర్శించిన హైడ్రా బృందం
- ఎఫ్‌టీఎల్ పరిధిని సర్వే చేసి తుది నివేదిక ఇవ్వాలని ఆదేశం
- మొత్తం నిర్మాణాలు, ఖాళీగా ఉన్నవాటిపై వివరాలు కోరిన అధికారులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 23: ఇబ్రహీంపట్నం పెద్ద చెరువును హైడ్రా అధికారులు సందర్శించారు. అందులోని అక్రమ నిర్మాణాలను వారు పరిశీలించారు. ఆంధ్రజ్యోతి జిల్లా పేజీలో జిల్లాలోని చెరువుల ఆక్రమణలపై 13రోజుల పాటు వరుస కథనాలు ప్రచురించింది. దీనిలో భాగంగా పెద్దచెరువు కబ్జాపై ఈ నెల 3న 'పేరుకే పెద్ద చెరువు' అనే శీర్షికతో ఆక్రమణలను వెలుగులోకి తీసుకొచ్చింది. దీనికి స్పందించిన హైడ్రా బృందం సోమవారం ఇబ్రహీంపట్నం పెద్ద చెరువును సందర్శించింది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణాలు ఏ మేరకు ఉన్నాయనే దానిపై ఆరా తీసింది. 30, 40 ఏళ్లుగా పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్‌లో అనేక నిర్మాణాలు వెలిసిన సంగతి తెలిసిందే. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న చెరువుల్లో ఇది ప్రధానమైనది కావడంతో దీని పరిరక్షణ కోసం హైడ్రా ముందుకు వచ్చింది. హైడ్రా ఆర్ఎఫ్‌వో పాపయ్య ఆధ్వర్యంలో వచ్చిన ఈ బృందంతోపాటు ఇరిగేషన్ డీఈ ఉషారాణి, ఏఈ రాజ్యలక్ష్మి, ఏసీపీ కేపీవీ రాజు, మున్సిపల్ అధికారులున్నారు. చెరువు పరిధిలోకి వచ్చే ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ, ఉప్పరిగూడ, చెర్లపటేల్‌గూడ, పోచారం గ్రామాల్లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని నిర్మాణాలను కూడా అధికారులు పరిశీలించారు. ఇప్పటికే ఎఫ్‌టీఎల్ హద్దులను తొలగించి ఆక్రమణలు జరగడంతో మరోమారు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి హైడ్రాకు నివేదిక ఇవ్వనున్నారు. ఈ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి 1,452.8 ఎకరాలు ఉంటుంది. 2016లో ఈ చెరువు ప్రిలిమినరీగా నోటిపై కాగా, సర్వే అనంతరం ఫైనల్ నోటిఫికేషన్ జారీచేసి అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టనున్నారు. మొత్తం నిర్మాణాలెన్ని..? గతంలో పంచాయతీగా ఉన్నప్పుడు, మున్సిపాలిటీగా ఏర్పాటైన తర్వాత సర్వే నంబర్ వారీగా ఎన్నింటికి అనుమతులు ఇచ్చారనే వివరాలు ఇవ్వాల్సిందిగా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అలాగే నివాసం ఉంటున్న ఇళ్లు, ఖాళీగా ఉన్నవి, ఇతర నిర్మాణాలపై వివరాలు ఇవ్వాలన్నారు.

ఆక్రమణదారుల్లో ఆందోళన

ఎఫ్‌టీఎల్‌లో భవనాలు నిర్మించుకొని నివాసం ఉంటున్న వారిలో ఒక్కసారిగా ఆందోళన మొదలైంది. హైడ్రా అధికారులు రావడంతో కూల్చివేతలు చేస్తారేమోనని భయపడ్డారు. నివాసముంటున్న వాటిని మినహాయించి ఖాళీగా ఉన్న నిర్మాణాలనే కూలుస్తారా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఏది ఏమైనా అక్రమ నిర్మాణాలు కూల్చుతారని తెలుస్తుంది.

దద్దరిల్లిన కలెక్టరేట్

ధర్నాలతో కలెక్టరేట్ దద్దరిల్లింది. సోమవారం పలు సంఘాల ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టారు. ప్రజావాణి కార్యక్రమం కూడా ఉండటంతో అర్జీలు ఇవ్వడానికి బాధితులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో కలెక్టరేట్ ఆవరణ అంతా జనంతో కిటకిటలాడింది. అంతేకాకుండా అక్కడ కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. - రంగారెడ్డి అర్బన్

పొట్టి శ్రీరాములు పేరు తొలగించొద్దని..

తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగింపు సమంజసం కాదని జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశం గుప్త డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. అసెంబ్లీ సమావేశంలో తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరుకు బదులు సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెట్టేందుకు మంత్రి వర్గం ఆమోదం తెలపడంపై తెలుగు భాషాభిమానులు తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు.



ధర్నా చేస్తున్న ఆర్యవైశ్య మహాసభ నేతలు

మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించాలని..



ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం, గుడ్ల బిల్లులు విడుదల చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, గ్యాస్‌కు సబ్సిడీ, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. మధ్యాహ్న భోజన నిర్వహణ స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వొద్దన్నారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ చట్టం అమలు చేయాలని..

ఎస్సీ సబ్‌ప్లాన్ చట్టం అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ప్రైవేట్ రంగంలో దళితులకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులకు సబ్సిడీ నిధులు విడుదల చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.



ధర్నా చేస్తున్న దళిత హక్కుల పోరాట సమితి నాయకులు

డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని..



ధర్నా చేస్తున్న డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల సంఘం నాయకులు

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని మంఖాల్-2 డబుల్‌బెడ్‌రూమ్ లబ్ధిదారుల సంఘం అధ్యక్షుడు సయ్యద్ ఇబ్రహీం డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం లబ్ధిదారులకు పట్టాలిచ్చినప్పటికీ ఇళ్లను కేటాయించ లేదని పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి యూసూఫ్ అలీ, అడ్వైజర్ ఖాజాబాయ్, లీగల్ అడ్వైజర్ గజనీ మహ్మద్, ఉపాధ్యక్షుడు మహ్మద్ ఫతే అలీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 62 ఫిర్యాదులు



సమస్యను వింటున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 23 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 62 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రజాపాలన నుంచి వచ్చిన ఫిర్యాదులపై అధికారులు స్పందించాలని ఆయన సూచించారు.

గోడు వినిపించేందుకు ..



కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద క్యూ

ఇదేదో బడా కంపెనీ... అందులో పని చేయడానికి వెళ్తున్న కార్మికులు వెళ్తున్నారనుకుంటున్నారా..? అదేంకాదండి బాబు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో తమ సమస్యలు తెలిపేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. దీంతో కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద పోలీసులు వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపించారు.

శాంతిభద్రతల పరిరక్షణలో అలసత్వం తగదు



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏసీపీ రంగస్వామి

ఆమనగల్లు, సెప్టెంబరు 23: శాంతిభద్రతల పరిరక్షణలో ఎక్కడా అలసత్వానికి తావుండకూడదని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి అన్నారు. పట్టణంలోని పోలీసు స్టేషన్‌ను సోమవారం ఏసీపీ తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ రికార్డులు, రిసెప్షన్, టెక్నికల్ రూమ్, పరిసరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి విధులకు సంబంధించి సూచనలు చేశారు. అనంతరం సీఐ ప్రమోద్ కుమార్, ఎస్సై బి.వెంకటేశ్‌లతో సమావేశమై శాంతిభద్రతల పరిరక్షణ, పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం చేయొద్దని అధికారులు, సిబ్బందికి సూచించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఏసీపీ ఆదేశించారు.

పోషకాహారం.. శ్రేయస్కరం



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

పోషకాహారం ఆరోగ్యానికి శ్రేయస్కరమని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం యాచారం కస్తూర్బా వసతి గృహంలో సమగ్ర శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మార్కెట్‌లో కల్తీ పదార్థాలు లభ్యమవుతున్నాయని, వాటిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీవో తులసి తదితరులున్నారు. - యాచారం

కలిసి సాగుదాం..



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

స్వచ్ఛత కోసం కలిసి సాగుదామని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని మండల అభివృద్ధి అధికారి శైలజారెడ్డి అన్నారు. సోమవారం మహేశ్వరం మండల కేంద్రంలోని గడికోట ఆవరణలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మానవహారం నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీవో పరిమళ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. - మహేశ్వరం



సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగేశ్వర్

ఆర్థికాభివృద్ధికి ఉత్పత్తి శక్తుల ఆదాయం పెంచాలి

మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె. నాగేశ్వర్

మహేశ్వరం, సెప్టెంబరు 23 : భారత ఆర్థిక వ్యవస్థ మరింత అభివృద్ధి చెందాలంటే ఉత్పత్తి శక్తుల ఆదాయాన్ని పెంచాలని, కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక చట్టాలు దేశ ఆర్థిక విధానానికి గొడ్డలి పెట్టు లాంటివని మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బి.దత్తునాయక్ అధ్యక్షతన తుక్కుగూడలో సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నాగేశ్వర్ మాట్లాడుతూ ఏఐటీయూసీ లాభాలకు ఏనాడూ వ్యతిరేకం కాదని, కార్మికుల కొనుగోలు శక్తి పెంచకుండా ఆర్థిక పురోగతి సాధించడం కష్టమన్నారు. పరిశ్రమలు ఉత్పత్తులను పెంచడం ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించలేమని, ప్రజలు, కార్మికులలో కొనుగోలు శక్తి లేకపోతే పారిశ్రామిక ఉత్పత్తులను ఎవరు కొనుక్కోవాలని అన్నారు. ఏఐటీయూసీ ఏర్పడినప్పటి నుంచి కార్మికుల హక్కుల కోసం, కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు చేస్తూనే ఉందన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కేవలం పెట్టుబడిదారులకు మాత్రమే ఆర్థిక లాభాలు చేకూరుస్తున్నాయని, కార్మికులను పట్టించుకోవడం లేదని అన్నారు. పెట్టుబడిదారులకు రాయితీలు ఇచ్చే ప్రభుత్వాలు.. పేదలకు, కార్మికులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు బాలరాజు, యూసుఫ్, జంగయ్య, రవీంద్ర, నర్సింహ, సీతారామయ్య, రత్నాకర్‌రావు, పావని, దేవేందర్‌రెడ్డి, రామస్వామి, జైపాల్‌రెడ్డి, సత్యనారాయణ, చంద్రయాదవ్, శేఖర్‌రెడ్డి, హరిసింగ్‌నాయక్, మల్లేష్, వెంకన్న, దేవేందర్‌గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లి అభివృద్ధికి సహకరిస్తా

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 23 : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకారం అందిస్తానని మాల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం కౌన్సిల్ సమావేశానికి ఎంపీ, ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ.. గుండ్లపోచంపల్లి మరింత అభివృద్ధి సాధించాలన్నారు. ఇక్కడ మల్టీస్టోర్ బిల్డింగ్‌లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు భారీగానే ఉన్నాయని, తద్వారా మున్సిపాలిటీకి ఆదాయం బాగానే సమకూరుతుందన్నారు. ఈ నిధులతో అభివృద్ధి చేయాలన్నారు. ఎంపీ కోట నుంచి కూడా నిధులిస్తానని తెలిపారు. తన నివాసం సైతం ఇదే మున్సిపాలిటీ పరిధిలో ఉన్నట్టు ఎంపీ చెప్పారు. సమస్యలపై ప్రజాప్రతినిధులు ఏ సమయంలోనైన తన ఇంటి తలుపు తట్టొచ్చన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ.. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి మంచి భవిష్యత్తు ఉందన్నారు. గతంలోనే పెద్దఎత్తున నిధులు కేటాయించామన్నారు. అభివృద్ధికి కౌన్సిల్ మరింత కృషిచేయాలన్నారు. 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి ఓఆర్‌ఆర్ వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు వెడల్పు చేసి రోడ్డు డివైడర్‌కు ఎంపీ నిధులివ్వాలని ఎమ్మెల్యే, కౌన్సిలర్లు ఈటలకు వినతిపత్రం ఇచ్చారు. ఛైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ ఎ.స్వామి, కౌన్సిలర్లు మల్లికార్జున్, ఎ.సరస్వతి, బాల్‌రాజ్, జైపాల్ రెడ్డి, హేమంత్‌రెడ్డి, పెంటయ్య, సాయిపేట శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రాజేందర్

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

కీసర రూరల్: వరద బాధితుల సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీ రాజేందర్ హామీ ఇచ్చారు. నాగారం మున్సిపాలిటీలోని బీఎంఆర్, ఎస్ఎల్ఎన్ కాలనీల్లో సోమవారం పర్యటించారు. వరద, బురదలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూశారు. నీరు నిలిచేందుకు గల కారణాలను గుర్తించాలని, తాత్కాలికంగా మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. వరద నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు అవసరమైన నిర్మాణాలు చేపట్టేందుకు అంచనాలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఆయనతో మున్సిపల్ చైర్మన్ కె.చంద్రారెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కిషోర్‌గౌడ్, డీఈఈ సుదర్శనరఘు ఉన్నారు.

వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి

చేవెళ్ల ఏరియా ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, సెప్టెంబరు 23 : వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య ఆదేశించారు. సోమవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిని ఎమ్మెల్యే ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో కలియతిరిగి రోగులతో మాట్లాడి వైద్యసేవలు, సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. రెగ్యులర్‌గా విధులకు డుమ్మాకొట్టిన వైద్యులు, సిబ్బందిపై ఉన్నతాధికారులకు ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆసుపత్రుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. మండల సీనియర్ నాయకుడు ఎం.కృష్ణారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

నిర్బంధం అప్రజాస్వామికం : ఆనంద్

వికారాబాద్, సెప్టెంబరు 23: నిర్బంధం అనేది అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. పేదల ఆరోగ్య పరిస్థితి, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న సేవలపై బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన త్రీమెన్ కమిటీలో ఆయన సభ్యుడు. మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ టి.రాజయ్య, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, ఆనంద్‌లతో కలిసి బీఆర్ఎస్ కమిటీని వేసింది. సోమవారం వారు గాంధీ ఆస్పత్రి సందర్శన పెట్టుకున్నారు. దీంతో ఆనంద్ వికారాబాద్ నుంచి వెళ్లకుండా పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే నివాసానికి చేరుకొని ప్రజా సమస్యలపై వెళ్తున్న నాయకుడిని హౌస్ అరెస్ట్ చేయడం ఏంటని మండిపడ్డారు. అయితే ఆనంద్ ఉదయం పోలీసుల కళ్లుగప్పి హైదరాబాద్ వెళ్లారు. నగరంలోని గాంధీ ఆస్పత్రి వద్ద నుంచి పోలీసులు ఆయనున్న స్టేషన్‌కు తరలించారు. తమను దేశద్రోహులుగా, నక్సలైట్లుగా, గుండాలుగా రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఇది దుర్మార్గ పాలన అన్నారు. వికారాబాద్‌లో ఎమ్మెల్యే నివాసానికి నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, గోపాల్, మేక చంద్రశేఖర్‌రెడ్డి, షఫీ వచ్చి నిరసన తెలిపారు.



మాజీ ఎమ్మెల్యే ఆనంద్ నివాసం వద్ద ఉన్న పోలీసులు

ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే కేసులు తప్పవు



చేవెళ్ల, సెప్టెంబరు 23 : వాహనదారులు మద్యం సేవించి వాహనాలను నడపడం చట్టరీత్యా నేరమని, ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే కేసులు తప్పవని రిటైర్డ్ జడ్జి సాంబశివుడు అన్నారు. సోమవారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో లోక్ అదాలత్‌ను చేవెళ్ల మున్సిఫ్ కోర్టు ఆవరణలో నిర్వహించారు. మొత్తం 128 కేసులను పరిష్కరించడంతో పాటు జరిమానా రూ.3,41,000లక్షలు విధించారు. చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేతి పంపులను వాడుకలోకి తేవాలి

చేవెళ్ల, సెప్టెంబరు 23 : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న చేతిపంపులను వాడుకలోకి తీసుకువచ్చే బాధ్యత వాటర్‌మెన్‌లదేనని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఆంజనేయులు తెలిపారు. సోమవారం చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో నీటి సరఫరా చేసే నీటి సహాయకులకు నాలుగు రోజులపాటు నిర్వహించే శిక్షణ తరగతులను ఎస్ఈ ఆంజనేయులు, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యలు కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పైపుల లీకేజీలు, సింగిల్, త్రీఫేజ్ మోటర్ల స్టాటర్లు రిపేరు చేయడంపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ తరగతులు చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ మండలాల్లోని అన్ని గ్రామాల సిబ్బందికి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈఈ రాజేశ్వర్, డీఈ హరిక, ఎంపీడీవో హిమబిందు, ఏఈ గీతస్రవంతి,అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈ ఆంజనేయులు

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



వెల్జాల్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో శాంతిరేఖ

తలకొండపల్లి, సెప్టెంబరు 23: పోషకాలతో కూడిన ఆహారం సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడుతుందని ఆమనగల్లు ఐసీడీఎస్ సీడీపీవో శాంతిరేఖ అన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు, కిశోర బాలికలు సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. తలకొండపల్లి మండలం వెల్జాల అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారాలతో కూడిన ఆహారాల ప్రదర్శన నిర్వహించారు. పోషక విలువల గురించి స్థానికులకు అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీవో రఘు, సూపర్‌వైజర్ తిరుమల, డాక్టర్ సైదమ్మ, కార్యదర్శి శరత్, టీచర్లు నస్రీన్ బేగం, వసంత లక్ష్మి, భూషణమ్మ, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయించండి

యాచారం, సెప్టెంబరు 23 : మండలంలోని గుంతలు పడిన వివిధ గ్రామాల రోడ్లను బాగు చేయించాలని, చాలా వరకు రోడ్లు పాడైపోయాయని యాచారం మండల కాంగ్రెస్ నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణయాదవ్, సుధీర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డికి వివరించారు. సోమవారం నగరంలోని రాంరెడ్డి నివాసంలో ఆయన్ను కలిసి సత్కరించారు. పాడైన ఆర్‌అండ్‌బీ రోడ్ల దుస్థితిని రాంరెడ్డికి వివరించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి తక్షణమే బాగు చేయించాలని కోరారు. మీర్‌ఖాన్‌పేట నుంచి యాచారం మండల కేంద్రం వరకు సాగుతున్న పనులు ఏడాదిన్నరగా అసంపూర్తిగా ఉన్నాయని రాంరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. త్వరలో ఉన్నతాధికారులతో మాట్లాడి రోడ్లన్నీ బాగు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని రాంరెడ్డి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. రవీందర్, వెంకటేష్ తదితరులు చైర్మన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.



రాంరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



బీజేపీ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఎంపీ డీకే.అరుణ

కొడంగల్, సెప్టెంబరు 23: క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే.అరుణ అన్నారు. సోమవారం మండలంలోని అన్నారంలో పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. బూత్‌స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయిలకు పార్టీని పటిష్ఠం చేసేందుకు కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. సభ్యత్వ నమోదును వేగవంతం చేస్తూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పూనం చంద్ లాహోటీ, బస్వరాజ్, బంటు రమేశ్, ప్రతాప్‌రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యం



మాట్లాడుతున్న రత్నం

పరిగి, సెప్టెంబరు 23: ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రత్నం అన్నారు. సోమవారం పరిగిలో జరిగిన ఫెడరేషన్ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోందన్నారు. సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలను విడుదల చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి టీఎస్‌యూటీఎఫ్ పోరాటాలు చేస్తోందన్నారు. సమావేశంలో ఫెడరేషన్ కార్యదర్శి ఎ.రాములు, కె.వెంకటయ్య, బుచ్చయ్య, ముత్యప్ప, గంగాధర్, రమేశ్, పాండురంగం, లక్ష్మణ్, మెష్యు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

నేవీ రాడార్ ఏర్పాటును ఉపసంహరించుకోవాలి



నేవీ రాడార్‌పై దాదాపూర్‌లో నిరసన తెలుపుతున్న యువకులు

దోమ, సెప్టెంబరు 23: పూడూరు మండలం దామగుండం అటవీ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన నౌకాదళ రాడార్ స్టేషన్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, సోమవారం దోమ మండలం దాదాపూర్‌లో యువకులు నిరసన తెలిపారు. భూ విస్తీర్ణంలో కనీసం 33శాతం అటవీ ప్రాంతాలుండాలన్నారు. అయితే రాడార్‌తో చెట్లన్నీ నరికివేతకు గురవుతాయని, ఇక్కడ వాతావరణ సమతుల్యం దెబ్బతింటుందన్నారు. గ్లోబల్ వార్మింగ్‌కు దారితీసే కార్యక్రమాలను ప్రభుత్వాలు విరమించుకోవాలన్నారు. దామగుండం అటవీ ప్రాంత పరిరక్షణకు ప్రజలంతా కలిసిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యు.కృష్ణ, గురుచరణ్‌గౌడ్, సిద్ధేశ్వర్, ఆంజనేయులు, వెంకటయ్య, పి.శ్రీనివాస్, డి.చెన్నయ్య, వెంగ్రలావు, చెన్నయ్య పాల్గొన్నారు.

పోలీసులు పనితీరును మెరుగుపర్చుకోవాలి



పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణ

దౌల్తాబాద్, సెప్టెంబరు 23: పోలీసు సిబ్బంది తమ పనితీరును ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకోవాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. సోమవారం దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్ కేసులపై అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాలు, ఆత్మహత్యలు జరగకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డయల్ 100కు వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఎస్పీతో పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, దౌల్తాబాద్ ఎస్సై రవిగౌడ్ ఉన్నారు.

రాజీయే రాజమార్గం : ఎస్పీ



జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, సెప్టెంబరు 23: కేసుల్లో రాజీ కుదుర్చుకునేందుకు ఈ నెల 28న జిల్లాకోర్ట్ ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహిస్తామని ఎస్పీ నారాయణరెడ్డి సోమవారం తెలిపారు. కక్షిదారులు ఎవరైనా తమ కేసుల రాజీకి లోక్ అదాలత్‌కు వచ్చి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్లలో కేసులున్నవారు రాజీ కావాలనుకుంటే స్థానిక పోలీస్‌స్టేషన్లో సంప్రదించాలని ఎస్పీ సూచించారు. రాజీ మార్గమే రాచమార్గం అని సూచించారు.

విద్యార్థినులకు ఏఐపై ఉచిత శిక్షణ

లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్, డెల్ టెక్నాలజీ సహకారం



సర్టిఫికెట్లు ప్రధానం చేస్తున్న ప్రొఫెసర్ రంజిత్ తదితరులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదువుకునే విద్యార్థినులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్, డెల్ టెక్నాలజీ సంయుక్తంగా నిర్వహించాయి. హైదరాబాద్, రంగారెడ్డి, తాండూరు జిల్లాల్లోని 25 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 250 మందికి ఏఐ (డాటా ఎనలిటిక్స్, పవర్‌బీఐ, సాఫ్ట్‌స్కిల్స్)పై శిక్షణ అందించారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు కమిషనర్ ఆఫ్ కాలేజీ ఎట్ ఎడ్యుకేషన్ కమిషనర్ ప్రొఫెసర్ రంజిత్, జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి అకడమిక్ గైడెన్స్ అధికారి బాల భాస్కర్‌లు సోమవారం సర్టిఫికెట్లు అందించారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



పరిసరాలను శుభ్రం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 23: పారిశుధ్యం విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి కోరారు. ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం ర్యాలీ నిర్వహించి ఆసుపత్రి ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించారు. పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొంటుందని ఆమె అన్నారు. అనంతరం మార్కెట్ యార్డులో స్వచ్ఛత కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బర్ల మంగ, వైద్య బృందం, ఎన్‌ఎస్‌జీ కమాండోలు పాల్గొన్నారు.



ఆర్టీసీ డిపో ఆవరణలో చేరిన మురుగు నీరు



మురుగు నీటిలో పొర్లాడుతున్న పందులు

ఆర్టీసీ డిపో ఆవరణంతా మురికి కంపు!

- పారుతున్న డ్రైనేజీ నీరు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- దుర్వాసనతో ప్రయాణికులు, సిబ్బంది ఇబ్బందులు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 23: మేడ్చల్‌లోని ఆర్టీసీ డిపో పరిసరాల్లో పారుతున్న మురుగు నీటితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీల మురుగంతా డిపో పరిసరాల్లోకి చేరుతోంది. దుర్వాసనతో ప్రయాణికులు ముఖానికి గుడ్డచుట్టుకొని నిరీక్షిస్తున్నారు. రెండు రోజులుగా డిపో ఆవరణలో భారీగా చేరుతున్న మురుగుతో ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ సిబ్బంది స్పందించడం లేదు. అసలు ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి మురుగునీటి పైప్‌లైన్లు, డ్రెయిన్లు ఎలా వేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనిపై తాము మున్సిపల్ అధికారులు, సిబ్బందికి తెలియజేశామని ఆర్టీసీ అధికారులంటున్నారు.

అయ్యో.. దేవమ్మా

- గూడు లేదు.. ఆదరించేవారూ కరువే
- ఏడాదిన్నర కాలంగా పాఠశాల వరండాలో జీవనం
- మతిస్థిమితం లేని కొడుకుతో వృద్ధురాలి బతుకు పోరాటం
- మైల్వార్‌లో తల్లి, తనయుల దీనస్థితి



పాఠశాల వరండాలో ఉంటున్న వృద్ధురాలు దేవమ్మ

బషీరాబాద్, సెప్టెంబరు 23: నిలువ నీడ లేదు.. కుడుపు నిండా తిండీ కరువే .. ఆదరించేవారెరూ లేకపోవడంతో ఓ వృద్ధురాలు.. తన కొడుకుతో కలిసి దుర్భర జీవితం గడుపుతోంది. తల్లి, కొడుకు ఓ పాఠశాల వరండా ఆవాసంగా మార్చుకుని దిక్కులేని అనాథలుగా బతుకునీడుస్తున్నారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజన సమయంలో దయతలచి ఎవరైనా బుక్కెడు అన్నం పెడితే ఆదే తింటూ కాలం వెల్లదీస్తున్నారు. బషీరాబాద్ మండలం మైల్వార్‌కు చెందిన గార్దన్ దేవమ్మ(72) భర్త కొన్నేళ్ల కిందట చనిపోయాడు. ఓ కూతురు ఉండగా పెళ్లిచేసి పంపించింది. వారికి కొడుకు భీంశంకర్(30) ఉన్నాడు. మూడేళ్ల కిందట పెళ్లి చేయగా, అతడితో భార్య కాపురం చేయక కొడుకుతో పుట్టింటికి పోయిందని వృద్ధురాలు తెలిపింది. ఈ నిరుపేద కుటుంబానికి ఉన్న ఇళ్లు కూడా శిథిలావస్థకు చేరడంతో కొత్త కష్టాలు వచ్చాయి. చేసేదేమి లేక ఊరిలోని మజీద్, అంగన్‌వాడీ భవనం, పాఠశాల ఆవరణల్లో తల్లీ, కొడుకు తలదాచుకుంటూ కాలం గడుపుతున్నారు. ఏడాదిన్నర కాలంగా ప్రాథమిక పాఠశాల వరండాలో తల్లి, కొడుకు ఉంటున్నారు. కాగా భీంశంకర్ మతిస్థిమితం సరిగాలేక ఎక్కడెక్కడో తిరిగి వస్తాడని, ఉండేందుకు గూడు, తిండి లేక నరకం అనుభవిస్తున్నామని దేవమ్మ రోదిస్తోంది. ఆమెకు ఆసరా పింఛన్ వస్తుడటంతో తల్లీకొడుకు బిస్కెట్లు, బ్రెడ్‌లు కొనుక్కొని తింటూ బతుకీడుస్తున్నారు. డబ్బులు అయిపోతే పస్తులుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ తల్లీ, కొడుకు దయనీయ పరిస్థితిపై స్పందించి ఓ ఇల్లు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సనాతనధర్మ పరిరక్షణకు పాటుపడాలి



చిలుకూరు బాలాజీ ఆలయంలో బీజేపీ నాయకురాలు మాధవిలత, తదితరులు

మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 23: ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో సనాతనధర్మ పరిరక్షణకు అందరూ కలిసికట్టుగా పాటుపడాల్సిన అవసరముందని బీజేపీ నాయకురాలు మాధవిలత పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ వేంకటేశ్వరస్వామిని ఆమె దర్శించుకున్నారు. మాధవిలత మాట్లాడుతూ తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన చిలుకూరు బాలాజీని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీ ఘటన సిగ్గు చేటని, జగన్ ప్రభుత్వ హయాంలో ఇతర మతాల వారిని టీటీడీ బోర్డు సభ్యులుగా, ఆలయ సిబ్బందిగా నియమించడమే ఇలాంటి అనర్థాలకు కారణమని ఆరోపించారు. ఏబీవీపీ నాయకులు రాకేష్ యాదవ్, షాపురం శ్రీకాంత్, హిమాయత్‌నగర్ బాబునాయక్, బీజేపీ నాయకులు ఉన్నారు.

ఏపీ మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మ దహనం



జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

కేశంపేట, సెప్టెంబరు 23: తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలవడం ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ దిష్టిబొమ్మను సోమవారం కేశంపేట మండల కేంద్రంలో బీజేపీ నాయకులు దహనం చేశారు. కేశంపేట మండలాధ్యక్షుడు రొల్ల రఘురాములుగౌడ్ ఆధ్వర్యంలో జగన్‌మోహన్‌రెడ్డి దిష్టి బొమ్మను తయారు చేసి శవయాత్ర నిర్వహించారు. జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంబేడ్కర్ చౌరస్తా వరకు శవయాత్ర చేపట్టి నిప్పంటించారు. జగన్‌పై చర్యలు తీసుకోవాలని కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. జిల్లా కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మోటే శ్రీనివాస్, యువమోర్చా అధ్యక్షుడు పాలాది శ్రీనివాస్, నాయకులు శేఖర్, తట్టేపల్లి నర్సింహ, బండ వెంకటేష్, కిష్టయ్య, శివ, అనేమోని పారేశ, పోచమోని నవీన్, రమేష్, యాదగిరి, జైపాల్ రెడ్డి, శ్రీకాంత్, సాయి, రాములు, యాదగిరి పాల్గొన్నారు.

సంగయ్యలొంక ఆలయానికి 800ఏళ్ల చరిత్ర



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు సదానందారెడ్డి

వికారాబాద్, సెప్టెంబరు 23: మదన్‌పల్లిలోని సంగయ్యలొంక ఆలయానికి 800ఏళ్ల చరిత్ర ఉందని, కొందరు ఆలయ మాన్యంలోకి వచ్చి దౌర్జన్యం చేస్తున్నారని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర నాయకుడు సదానందారెడ్డి అన్నారు. సోమవారం ఆలయ ఆవరణలో గ్రామస్థులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ స్థలాలను సంగమేశ్వరుడి బండలు అంటారని, ఇప్పుడు కొందరు రోడ్డు తవ్వేస్తూ భక్తులను రానివ్వడం లేదన్నారు. రికార్డు ప్రకారం కూడా సంగయ్యలొంక స్థలం అనే ఉందన్నారు. ఇది ప్రైవేట్ స్థలం కాదన్నారు. ఆలయ భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని మండిపడ్డారు. పచ్చని ప్రకృతితో విరాజిల్లుతున్న దేవాలయం ఆవరణను పర్యాటకంగానూ అభివృద్ధి చేయొచ్చన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకొని ఆలయ భూమిని, ఆలయాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాములు, సోమిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంచందర్, రమేష్, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సిరియాలు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.



శంషాబాద్‌రూరల్ : కమిషనర్‌కు రికార్డులు అందిస్తున్న కార్యదర్శులు



మహేశ్వరం : కమిషనర్‌కు రికార్డులను అందిస్తున్న శైలజారెడ్డి

మున్సిపాలిటీకి విలీన గ్రామాల రికార్డులు అందజేత

శంషాబాద్ రూరల్/మహేశ్వరం, సెప్టెంబరు 23: ఇటీవల ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేసిన గ్రామాల రికార్డులను పంచాయతీ కార్యదర్శులు అందించారు. సోమవారం శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావును కలిసి మండలంలోని విలీనమైన గ్రామాల రికార్డులను కార్యదర్శులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు. అదేవిధంగా ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని గ్రామ పంచాయతీలను సమీపంలోని మున్సిపాలిటీలో విలీనం చేయడంతో మహేశ్వరం మండలంలోని హర్షగూడను తుక్కుగూడ మున్సిపాలిటీలో విలీనం చేశారు. ఈమేరకు సోమవారం పంచాయితీ అధికారులు మున్సిపల్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో తుక్కుగూడ మున్సిపాలిటీ అధికారులకు హర్షగూడ పంచాయితీ రికార్డులను అప్పగించారు.

అపూర్వ కలయిక.. ఆనందాల వెల్లువ

60 ఏళ్ల తర్వాత కులుసుకున్న బాల్యమిత్రులు



సమ్మేళనంలో అరవై ఏళ్ల నాటి బాల్యమిత్రులు

ఆమనగల్లు, సెప్టెంబరు 23: బాల్యం మరువలేని జ్ఞాపకం.. ఏ స్థాయిలో ఉన్నా చిన్ననాటి మిత్రులు కనిపిస్తే తెలియకుండానే చిన్నపిల్లలు అయిపోతారు. బాల్యంలో చేసిన చిలిపి చేష్టలు, ఆడుకున్న బొమ్మలాటలు, అల్లరిపనులు తలుచుకుంటూ ఆనందంలో మునిగి తేలుతారు. ఆరు దశాబ్దాల తర్వాత కలుసుకున్న ఆ మహిళల్లో అలాంటి జ్ఞాపకాలే కన్పించాయి. ఆనందాల నవ్వులే వెల్లివిరిసాయి. ఆమనగల్లు పట్టణంలోని చిల్వేరు అండాలు నివాస గృహంలో సోమవారం వారంతా ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. మాడ్గుల మండలం గిరికొత్తపల్లికి చెందిన బాల్యమిత్రులు పున్న పద్మమ్మ, చిల్వేరు అండాలు, ఈడెం మంగమ్మ, ఆరుగొండ లక్ష్మమ్మ, ఇట్టె నారాయణమ్మ, కటికె యాదమ్మ, ఇట్టె పుష్పనీల, పాపమ్మ, కృష్ణమ్మ, పెంటమ్మ, రామకృష్ణ, మధులు కలుసుకున్నారు. దాదాపు 60 ఏళ్ల తర్వాత కలిసిన వారు బాల్య స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఒకరికొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆత్మీయ ఆలింగనాలు, పలకరింపులు, ఆట పాటలతో అలరించారు. అపూర్వ క్షణాలను ఆ వృద్ధ వయస్సులో తమ తమ చరవాణిలలో బంధించారు. అనంతరం ఆత్మీయ విందు ఆరగించారు.



చక్రంపల్లికి బస్సు రావడంతో హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

స్పీకర్ చొరవతో బస్సు సౌకర్యం

మోమిన్‌పేట్, సెప్టెంబరు 23: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చొరవతో హైదరాబాద్ నుంచి పంచలింగాల వయా చక్రంపల్లి బస్సు సర్వీసు ప్రారంభమైంది. దీంతో సోమవారం గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామానికి వచ్చిన బస్సుకు పూజలు నిర్వహించారు. గ్రామస్థులు మాట్లాడుతూ తాము ఇకపై ఆటోలు, వ్యక్తిగత వాహనాలపై వెళ్లడం తప్పుతుందన్నారు. రైతులు పండ్లు, కూరగాయలను హైదరాబాద్ మార్కెట్‌కు తరలించేందుకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విక్రంరెడ్డి, గ్రామస్థులు బాల్‌రెడ్డి, ప్రవీణ్, నాగయ్య, నర్సింహారెడ్డి, వీరమల్లాగౌడ్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ఫరీద్ పాల్గొన్నారు.

వీధి కుక్కల జనన నియంత్రణకు చర్యలు



పట్టుకొచ్చిన కుక్కలను పరిశీలిస్తున్న చైర్మన్ ఎం.అశోక్

పరిగి, సెప్టెంబరు 23: మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల జనన నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ తెలిపారు. సోమవారం జంతుజనన నియంత్రణ కేంద్రాన్ని పరిశీలించారు. పట్టుకొచ్చిన కుక్కలను పరిశీలించారు. రెండు, మూడు రోజుల్లో పరిగిలోని అన్ని కుక్కలకు జనన నియంత్రణ ఆపరేషన్లను ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే 472 కుక్కలను గుర్తించామని చెప్పారు. ప్రజలు, పశువులను కుక్కల బెడద ఉంచి రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరిగిలో కుక్కల సంతానోత్పత్తి నియంత్రణ కేంద్రం నిరంతరం పనిచేస్తుందన్నారు. సంతానం కలగకుండా చికిత్స చేసి, రేబిస్ టీకాలు కూడా వేయిస్తామని తెలిపారు. పెంపుడు కుక్కలకు కూడా ఇక్కడ శస్త్రచికిత్సలు చేయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్ వారాల రవీంద్ర, మల్లేశ్, తాహెర్‌అలీ పాల్గొన్నారు.

గ్రామీణులకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలి



మిషన్ భగీరథ శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న డీఈఈ విజయశ్రీ

శామీర్‌పేట, సెప్టెంబరు 23: గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన నీటినే సరఫరా చేయాలని మిషన్ భగీరథ శాఖ డీఈఈ విజయశ్రీ అన్నారు. సోమవారం శామీర్‌పేట మండల పరిషత్‌లో మిషన్ భగీరథ కార్పొరేషన్ డీఈఈలు విజయశ్రీ, మహేందర్ శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల నల్‌జల్ మిత్రులకు, పంచాయతీ సిబ్బందికి నాలుగు రోజుల శిక్షణ కార్యాక్రమాన్ని ప్రారంభించారు. డీఈఈలు మాట్లాడుతూ నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పైప్‌లైన్లు ఎక్కడా లీకేజీలు లేకుండా మరమత్తులు, బోరు బావులు, చేతిపంపులు, సింగిల్ ఫేస్, త్రీఫేజ్ మోటార్ల మరమ్మతులు ఎప్పటికప్పుడు చేస్తుండాలన్నారు. రోజువారీ పనులపై వాటర్‌మెన్‌కు శిక్షణిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు మమతాబాయి, వత్సలాదేవి, ఏఈఈలు స్వాతి, సామ్యేల్, అఖిల, శ్రీదేవి, విద్యాసాగర్, పలువురు వాటర్‌మెన్ పాల్గొన్నారు.



కందుకూరు : మాట్లాడుతున్న డీఈఈ జగన్‌మోహన్‌రెడ్డి, ఎండీవో సరిత

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

యాచారం, సెప్టెంబరు 23 : ప్రతీరోజు నీటిని పరీక్షించిన తరువాతే ప్రజలకు అందించాలని మిషన్ భగీరథ ఏఈ ప్రణయ్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో వివిధ గ్రామాల వాటర్‌మెన్‌లకు నీటి నాణ్యతపై నాలుగు రోజుల పాటు సాగే శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు కలుషిత నీటిని గుర్తించే విధానంపై అవగాహన కల్పించారు. పైప్‌లైన్ లీక్ కాకుండా నిత్యం తనిఖీ చేయాలని, ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకులు శుభ్రంచేసి క్లోరినేషన్ చేయాలని, వీలుంటే నీటిని ల్యాబ్‌కు తరలించి పరీక్షలు చేసుకోవాలన్నారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్‌ను తాగునీటి కోసం వాడుకుంటున్నామని, ఈ నీరు ముచ్చర్ల గుండా మండలానికి సరఫరా అవుతున్నట్లు వారు తెలిపారు. అదేవిధంగా గ్రామ పంచాయతీల్లో వాటర్‌మెన్‌లు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలని మిషన్ భగీరథ డీఈఈ జగన్‌మోహన్‌రెడ్డి, ఎండీవో సరితలు కోరారు. కందుకూరు మండలంలోని గ్రామాల వాటర్‌మెన్‌లకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు కె.శారద, ఇందిర, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల పవిత్రతను కాపాడాలి

తలకొండపల్లి, సెప్టెంబరు 23: తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, తలకొండపల్లి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసిన ఈ వ్యవహారం వెనుక ఎంతటి వారున్నా ఉపేక్షించవద్దని కోరారు. వెల్జాల గ్రామంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుమల పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. లడ్డూ కల్తీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించాలని శ్రీనివాస్ యాదవ్ కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు.

అనర్హులకు పరిహారం చెల్లింపుపై విచారణ

యాచారం, సెప్టెంబరు 23 : ఫార్మాసిటీ భూసేకరణలో అక్రమంగా డబ్బు కాజేసిన వారిపై రెవెన్యూ ఉన్నతాధికారులు విచారణ చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో భూసేకరణ వేగవంతం చేయాలని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ, టీఎస్ఐఐసీ అధికారులను ఆదేశించడంతో అధికారులు యుద్ధప్రాతిపదికన భూసేకరణ చేపట్టారు. దాంతో అప్పట్లో కొందరు నగరానికి చెందినవారు, వివిధ గ్రామాల్లోని రైతుల పేరిట సంబంధం లేకున్నా దొడ్డిదారిన తప్పుడు పత్రాలతో డబ్బు కాజేశారనే విషయం అప్పట్లో కలెక్టర్‌తో పాటు టీఎస్ఐఐసీ అధికారుల దృష్టికి వచ్చింది. కొంత మంది బడా రాజకీయ నాయకులు అధికారులపై ఒత్తిడి చేసి భూములకు సంబంధం లేని వ్యక్తులకు పరిహారం ఇప్పించారని గతంలో జోరుగా ప్రచారం జరిగింది. అయితే, ప్రస్తుతం తాటిపర్తిలోని 104 సర్వేనెంబర్‌లో అనర్హులు డబ్బు కాజేశారని ఉన్నతాధికారులకు తెలియడంతో విచారణకు సిద్ధమైనట్లు సమాచారం.

జీపీ కార్మికులకు వైద్య పరీక్షలు



కేశంపేట : మందులు అందిస్తున్న సిబ్బంది, పక్కన ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి

ఆమనగల్లు/కేశంపేట, సెప్టెంబరు 23: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేయగా ఎంపీడీవో కుసుమ మాధురి ప్రారంభించారు. వైద్యులు పరీక్షిత్ నరేంద్ర, నాగరాజు, సిబ్బంది పరీక్షలు చేసి మందులందజేశారు. ఎంపీవో వినోద, ఎంపీహెచ్ఈవో తిరుపతిరెడ్డి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి, కొత్తపేట సబ్‌సెంటర్ పరిధిలోని పంచాయతీ కార్మికులు, వారి కటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కొండారెడ్డిపల్లిలో 40, కొత్తపేటలో 46 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి, ఎంపీవో కిష్టయ్య, కేశంపేట వైద్యాధికారి నిఖితలు పరిశీలించా రు. ఉపేందర్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో

మోస్తరు వర్షం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 23: ఇబ్రహీంపట్నం టౌన్ సహా పరిసరాల్లో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిని మోస్తరు వర్షం కురిసింది. కాగా, వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రోడ్లపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

మహిళల ఎదుగుదలకు సీఎం కృషి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కొత్తూర్ : లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, సెప్టెంబరు 23: మహిళలు మరింత ఎదిగేందుకు సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తున్నారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద గృహజ్యోతి పథకంలో భాగంగా మహిళలకు సబ్సిడీ గ్యాస్ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు గ్యాస్ ధరలను పెంచి సామాన్యుల నడ్డి విరిచారని, మహిళలను దృష్టిలో పెట్టుకుని గత ఎన్నికల్లో రాహుల్‌గాంధీ 500లకే సిలిండర్ అందించాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులను ఆదేశించడం జరిగిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి తూచా తప్పకుండా పాటించి, దారిద్ర్య రేఖకు దిగువ ఉన్నవారందరికీ 500లకే సిలిండర్ అందిస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ బాలాజీ, మాజీ ఎంపీపీ జె. వేణుగోపాల్‌గౌడ్, మాజీ సర్పంచ్ జెనిగె జగన్, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ, మండల శాఖ అధ్యక్షులు జె. సుదర్శన్‌గౌడ్, గొంగళ్ల హరినాథ్‌రెడ్డి, నాయకులు వీరమోని దేవేందర్‌ముదిరాజ్, కమ్మరి జనార్దన్‌చారి, పీర్లగూడెం మహేష్‌గౌడ్, తుప్పర రమేష్, జగన్‌గౌడ్, బాబ్లుగౌడ్ తదితరులున్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించండి

చౌదరిగూడ : కొందుర్గు మండల కేంద్రంలోని పెండ్యాల గుట్టపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయం శిథిలావస్థకు చేరిందని, ఆలయ పునర్నిర్మాణానికి కృషి చేయాలని దేవాలయ కమిటీ సభ్యులు షాద్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్‌కు ఆలయ చైర్మన్ కృష్ణయ్య ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ దేవాదాయశాఖ అధికారులతో మాట్లాడి పునర్‌నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు. కమిటీ సభ్యులు బాల్‌రాజ్, నర్సింహులు, వేణుగోపాల్, అనిత, అమర్ లింగం, మాధవ రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో బలీయమైన శక్తిగా బీజేపీ



కొత్తూర్ : సిద్దాపూర్‌లో బీజేపీ సభ్యత్వాన్ని అందజేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

ఆమనగల్లు/కొత్తూర్, సెప్టెంబరు 23: ప్రధాని మోదీ సంకల్పించిన వికాసిత్ భారత్ సాకారం కోసం గ్రామ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ కల్వకుర్తి నియోజకవర్గ కో-కన్వీనర్ గోరటి నర్సింహ, ఆమనగల్లు మున్సిపల్ కౌన్సిలర్ చెక్కాల లక్ష్మణ్, మున్సిపాలిటీ బీజేపీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి దండు శ్రీనులు పిలుపు నిచ్చారు. ఆమనగల్లు మున్సిపాలిటీ 15వ వార్డులో సోమవారం చెక్కాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని నర్సింహ, లక్ష్మణ్ లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను విస్మరించి ప్రజలను వంచనకు గురిచేసిందని ఆరోపించారు. సభ్యత్వ నమోదు కో-కన్వీనర్ రవిరాథోడ్, నాయకులు పద్మప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు. అలాగే తిరుమల లడ్డూ ప్రసాదాన్ని కల్తీచేయడం నీచమైన చర్య అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి దుయ్యబట్టారు. కొత్తూర్ మండల పరిధిలోని సిద్ధాపూర్‌లో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సభ్యత్వాన్ని అందజేశారు. తిరుమలలో అన్య మతస్థులను చైర్మన్‌గా, ఉద్యోగులు నియమించవొద్దని గతంలో బీజేపీ డిమాండ్ చేసిందని, లడ్డూ కల్తీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల శాఖ అధ్యక్షుడు మంగలి రమేష్, సీనియర్ నాయకుడు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నేతలు



కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్, సెప్టెంబరు 23: రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్, గ్రీన్‌ఫీల్డ్ రోడ్ల నిర్మాణ విషయంలో మాజీ మంత్రులు కేటీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలపై చేసిన నిరాధార, అసత్య ఆరోపణలను నిరసిస్తూ సోమవారం కడ్తాల మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డీసీసీ అధికార ప్రతిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకుడు గూడూరు భాస్కర్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్‌లు హాజరయ్యారు. పార్టీ జెండాలు చేబూని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో కేటీఆర్, ప్రశాంత్ రెడ్డిల దిష్టి బొమ్మలను దహనం చేసి బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫోర్త్‌సిటీ కాదు ఫోర్ బ్రదర్స్ సిటీ అని కేటీఆర్, రీజినల్ రింగ్ రోడ్డు ప్రతిపాదిత ప్రాంతాల్లో కసిరెడ్డికి భూములు ఉన్నందునే అలైన్‌మెంట్ మార్పిస్తున్నారని ప్రశాంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై గూడూరు శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో దక్షిణ తెలంగాణకు అన్నివిధాలా అన్యాయం జరిగిందన్నారు. జిల్లా, మండల నాయకులు జహంగీర్‌బాబా, అశోక్, జహంగీర్‌అలీ, గురిగళ్ల లక్ష్మయ్య, రామకృష్ణ, అశోక్, రామచందర్ నాయక్, మాలే మల్లేశ్‌గౌడ్, యాదయ్య, సత్యం యాదవ్, బుచ్చయ్య, భిక్షపతి, కృష్ణ, శేఖర్‌గౌడ్, క్యామ రాజేశ్, షాబోద్దీన్, బానుకిరణ్, బోసు రవి, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గంజాయి సేవిస్తుండగా పోలీసుల దాడి

- ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఖాకీలు
- 250 గ్రాముల గంజాయి, 3 ఫోన్లు స్వాధీనం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 23: ఇబ్రహీంపట్నం టౌన్ బృందావన్ కాలనీలో సోమవారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించి గంజాయి సేవిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 250 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని విచారిస్తున్నారు. ఈ దాడుల్లో ఏసీపీ కేపీవీ రాజు, గ్రీన్‌ఫార్మా పోలీస్ స్టేషన్ సీఐ నర్సింహారావు, ఎస్సై రామకృష్ణలున్నారు. కాగా, వీరికి ఎక్కడి నుంచి గంజాయి సరఫరా అవుతోంది? ఈ ఘటనకు ఎంతమందికి సంబంధం ఉంది? ఎంతకాలంగా ఈ తతంగం జరుగుతోందనేది విచారిస్తున్నారు. ప్రస్తుతం నిందితులను విచారిస్తున్నామని, వివరాలు తర్వాత వెల్లడిస్తామని ఏసీపీ రాజు తెలిపారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

మహేశ్వరం, సెప్టెంబరు 23 : విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతిచెందిన ఘటన మహేశ్వరం మండలం డబిల్‌గూడలో చోటు చేసుకుంది. డబిల్‌గూడ గ్రామానికి చెందిన కర్ణం ప్రభాకర్ రోజూ మాదిరిగానే సోమవారం గేదెలను మేతకు వదిలాడు. పక్కనే ఉన్న పొలంలో విద్యుత్ తీగలు తెగిపడి ఉండడంతో గేదెలు వాటికి తగిలాయి. విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాయి. సాయంత్ర గేదెలను తీసుకురావడానికి వెళ్లిన ప్రభాకర్‌కు చనిపోయి ఉన్న రెండు గేదెలు కనిపించడంతో బోరున విలపించాడు. తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని వాపోయాడు.రెండు గేదెలు మృతి చెందడంతో రూ.2లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని రైతు ప్రభాకర్ కోరాడు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం



శ్రీకాంత్



రమావత్ బుజ్జి

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 23: వ్యక్తి అదృశ్యమైన సంఘటన శంషాబాద్ మండలంలో జరిగింది. ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు శంషాబాద్ మండలంలోని పిల్లోనిగూడకు చెందిన పానుగంటి శ్రీకాంత్ ఈ నెల 19న రాత్రి గ్రామంలోని వినాయక మండపం దగ్గరికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారు, బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ దొరకలేదు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై పానుగంటి శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘనపూర్‌నకు చెందిన రమావత్ బుజ్జి అదృశ్యమైనట్లు శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు అందింది. బుజ్జి బతుకు దెరువు కోసం రంగారెడ్డి జిల్లా గోపన్‌పల్లికి వచ్చి నివాసముంటోంది. ఈ క్రమంలో ఈ నెల 21న ఎంజీబీఎస్‌లో నాగర్‌కర్నూల్ ఎక్స్‌ప్రెస్ బస్సులో కుటుంబ సభ్యులు బుజ్జిని ఎక్కించారు. అదేరోజు రాత్రి ఆమెకు కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా ఓ వ్యక్తి ఫోన్ ఎత్తి బుజ్జి శంషాబాద్‌లో ఉందని, పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తుందని సమాచారం అందించాడు. తిరిగి ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో సోమవారం బుజ్జి సోదరుడు జాటావత్ జయబాబు శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహేందర్‌రెడ్డికి నాయకుల జన్మదిన శుభాకాంక్షలు



మహేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న పామెన భీంభరత్, కాంగ్రెస్ నాయకులు

షాబాద్/చేవెళ్ల, సెప్టెంబరు 23 : మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని సోమవారం నగరంలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, పీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, తదితరులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున్న పాల్గొని పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ నాయకులు ఎం.కృష్ణారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి ఉన్నారు.

బ్యాంకు రుణాలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న మేనేజర్ సుధీర్

చౌదరిగూడ, సెప్టెంబరు 23: మహిళ సంఘాల సభ్యులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని చౌదరిగూడ ఏపీజీవీబీ మేనేజర్ సుధీర్ తెలిపారు. సోమవారం మండల మహిళ సమాఖ్య భవనంలో ఆధ్యక్షురాలు మంజుల అధ్యక్షతన సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రుణాలను సకాలంలో చెల్లించి కొత్త రుణాలు పొందాలన్నారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. ఏపీఎం నర్సింహ, కార్యదర్శి లక్ష్మి, సీసీలు వీవోఏలు పాల్గొన్నారు.

ఘనంగా కర్రపూజ కార్యక్రమం



కర్రపూజ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఆమనగల్లు, సెప్టెంబరు 23: మున్సిపాలిటీ పరిధిలోని సాయినగర్ కాలనీలో సోమవారం శ్రీ దుర్గాభవాని 7వ వార్షికోత్సవం సందర్భంగా కర్ర పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సభ్యులు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దసరా ప్రారంభ సూచికగా ప్రతీయేటా కర్రపూజ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. నాయకులు శ్రీకాంత్ సింగ్, మన్న అప్పి, మామిడిశెట్టి ప్రవీణ్, పాతకోట శ్రీశైలం, బికుమాళ్ల సిద్దు, టిల్లు యాదవ్, చిందం రవి, నిఖిల్, శివ, శ్రీకాంత్, మహేశ్, అంజి, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్, సెప్టెంబరు 23: ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామ పరిధిలో ఉన్న ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. 10వ తరగతి పాస్ అయిన విద్యార్థులకు ఐదో దఫాలో మిగిలిన సీట్ల కోసం ఈ నెల 25వ తేదీ నుంచి 28వ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. వాకిన్ అడ్మిషన్ల కోసం ఆకస్తి గల విద్యార్థులు ఈ మూడు రోజుల్లో ఉదయం 11 వరకు కళాశాల సంప్రదించాలని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కోరారు.

పరిశ్రమ క్వార్టర్స్ వద్ద కంపు.. కంపు

- మురుగు పారడంతో ప్రజల ఇక్కట్లు
- పరిశ్రమ యాజమానికి నోటీసులు

కొత్తూర్, సెప్టెంబరు 23: పరిశ్రమ కార్మికుల క్వార్టర్స్ నుంచి వస్తున్న దుర్గంధం, చెత్తాచెదారం రోడ్డుపైకి విచ్చలవిడిగా వదులుతుండడంతో పారిశ్రామికవాడ నుంచి తీగాపూర్ వెళ్లే ప్రజలు ముక్కులు మూసుకుని పోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొత్తూర్ పారిశ్రామికవాడలోని మానస సరోవర్ ఐరన్ పరిశ్రమ తీగాపూర్ రోడ్డుకు అనుకుని ఉంది. పరిశ్రమ ఆవరణలోనే కార్మికుల కోసం క్వార్టర్స్‌ను ఏర్పాటు చేశారు. దాదాపు 300 మంది కార్మికులు పరిశ్రమలో పనిచేస్తూ, క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. వ్యర్థాలు, దుర్గంధం, చెత్తాచెదారం రోడ్డుపైకి వచ్చి చేరుతోందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ బాలాజీ దృష్టికి తీసుకొచ్చారు. దాంతో సోమవారం ఆయన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. పారిశుధ్య లోపం, శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్ కూల్చివేతకు పరిశ్రమ యాజమానికి నోటీసులు అందజేశామని తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



బహుమతులు అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి, తదితరులు

షాబాద్, సెప్టెంబరు 23 : క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పీఆర్ఆర్ మినీస్టేడియంలో చేవెళ్ల జోనల్ అండర్-14, 17 ఖోఖో క్రీడా పోటీల్లో 78 జట్లు పాల్గొన్నాయి, అండర్ 17 బాలురు విన్నర్ సత్యసాయి స్కూల్ చేవెళ్ల, రన్నర్ జన్వాడ శంకర్‌పల్లి, అండర్ 17 బాలికలు విన్నర్ షాబాద్ గురుకులం, రన్నర్ మోడల్ స్కూల్ చేవెళ్ల, అండర్ 14 బాలుర విన్నర్ జన్వాడ, శంకర్‌పల్లి, రన్నర్ సత్యసాయి చేవెళ్ల, అండర్ 14 బాలికలు విన్నర్ షాబాద్ గురుకుల, రన్నర్ మోడల్‌స్కూల్ చేవెళ్ల గెలుపొందిన ఏఎమ్మార్ స్పాన్సర్ వారు బహుమతులందజేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీలు జయమ్మ, చెన్నయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు అందజేత



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న దాతలు

షాద్‌నగర్, సెప్టెంబరు 23: పాఠశాల దశ నుంచే విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు వచ్చారు. ఈ మేరకు సోమవారం షాద్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (కుంటబడి)లోని విద్యార్థులకు రూ.30వేలు విలువ చేసే స్పోర్ట్స్ కిట్‌లను అందజేశారు. దాతలు పటాన్‌చెరువుకు చెందిన కాళిదాసు, పెద్దాపూర్‌కు చెందిన బొడ్డు రవికుమార్, సూరజ్ యాదవ్, బాలరాజు మాట్లాడతూ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బాలయ్య విజ్ఞప్తి మేరకు క్రీడా సమాగ్రిని అందజేశామన్నారు.

దైవ కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలి

తలకొండపల్లి, సెప్టెంబరు 23: దైవ కార్యక్రమాల్లో ప్రతీఒక్కరు పాలు పంచుకోవాలని మిషన్ భగీరథ కార్పొరేషన్ మాజీ వైస్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ కోరారు. గార్య తండాలో సోమవారం వెంకటేశ్ పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తండాలో తుల్జాభవానీ ఆలయ నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను అందజేస్తానని గిరిజనులకు హామీ ఇచ్చారు.

సంక్షిప్తంగా..

కందుకూరు : ఎన్నికల ప్రక్రియపై నేదునూరు ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఎన్నికల నిర్వహణను ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పి.విష్ణుప్రియ తెలిపారు. భోజన సమయంలో నిర్వహించిన ఎన్నికల్లో 19మంది విద్యార్థులు పోటీలో నిలబడగా.. 571మంది విద్యార్థులు ఓటింగ్‌లో పాల్గొన్నట్లు తెలిపారు.

యాచారం : మండల పరిధిలోని రైతులకు ఇప్పటి వరకు 423 మందికి రూ.3.15లక్షల రుణాలు అందించామని సొసైటీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, సీఈవో నాగరాజు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 715 మంది రైతులకు రూ.4.73లక్షల రుణాలు ప్రభుత్వం మాఫీ చేసినట్లు చెప్పారు. డీసీసీబీ మేనేజర్ నాగలక్ష్మి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

యాచారం : మండల కేంద్రానికి చెందిన తడకమళ్ల శిరీష ఇటీవల గురుకులల్లో భర్తీ కోసం నిర్వహించిన పోటీ పరీక్షలో టీజీటీ(ఆంగ్లం) పరీక్ష రాయడంతో ఉద్యోగం వచ్చింది. దాంతో సోమవారం మొదటి నెల వేతనం రూ.53.229 నిర్వాహకులకు అందజేసింది. జ్ఞాన సరస్వతి సేవాసమితి సభ్యులు నిఖిల్‌కుమార్‌రెడ్డి తదితరులు శిరీషా దంపతులను అభినందించారు.

తలకొండపల్లి : మాదాయిపల్లిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. హైదరాబాద్ కామినేని ఆసుపత్రి, ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ అఖిల్, అనిల్, కామినేని ఆసుపత్రి వైద్య సిబ్బంది 225 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మాజీ సర్పంచ్ హైమావతి రామస్వామి, ఉప సర్పంచ్ జయమ్మశ్రీనివాస్, నాయకులు గౌరయ్య, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్ : మండల పరిధిలోని మోత్కుపల్లికి చెందిన తలారి ఆనంద్(30) ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందాడు. దాంతో అదే గ్రామానికి చెందిన యువ నాయకుడు ఫిరంగి భాస్కర్ ఆనంద్ మృతదేహానికి నివాళులర్పించి అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.10 అందజేశాడు.

తలకొండపల్లి : వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను సోమవారం తలకొండపల్లి మండలం దేవుని పడకల్ మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి సత్కరించారు. దేవుని పడకల్‌లో ప్రభుత్వ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని, అభివృద్ధి పనులకు ప్రభుత్వ పరంగా సహకారం అందించాలని, తలకొండపల్లి, గట్టిప్పలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆధునీకరించి మెరుగైన వసతులు కల్పించాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు శ్రీశైలం తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు అంబటి భిక్షపతి, రాజమోని శంకర్, పద్మ సత్యం, తదితరులు ఉన్నారు.